సాక్షి
మంచిర్యాల
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



డెడ్‌స్టోరేజీకి 'గొల్లవాగు' 10లో▸
భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుతోంది. ఎండల తీవ్రతతో రోజురోజుకు నీటిమట్టం పడిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



ఇళ్లు ఇచ్చేదెప్పుడో! 11లో▸
జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులకు అప్పగించలేదు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏడాది గడుస్తున్నా నిరుపయోగంగా ఉన్నాయి.

గరిష్టం/కనిష్టం
35.0 /26.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. తూర్పు దిశగా చలిగాలులు వీస్తాయి. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లో చేరిన తాజా మాజీ సర్పంచులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేక్

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచులు గద్దె రాంరెడ్డి(భీమారం), దర్శనాల రమేశ్(పోలంపల్లి), మల్లేశ్(నర్సింగాపూర్), తిరుపతి(కొత్తపల్లి), కొడిపె సమ్మయ్య(ఎలకేశ్వరం), సంతోషం భాస్కర్‌రెడ్డిలతోపాటు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌నాయక్, మండల రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ మహేష్‌రెడ్డి, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, జిల్లా నాయకులు పాడేటి రవి, చేకూర్తి సత్యనారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్‌రెడ్డి, నాయకులు బుక్యా లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు వీరమల్ల రాజయ్య, బంగారి ప్రసాద్, రెల్లి, పాడి రైతు సంఘం నాయకులు శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుమారు 200 మంది పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, గోపతి రాజయ్య, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే విగ్రహావిష్కరణ



పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని బీసీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సింగరేణి కాలరీస్‌లోనే ప్రప్రథమంగా శాంతిఖని గనిపై జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఆవిష్కరించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బీసీ అసోసియేషన్ సలహాదారు చిలుక శ్రీనివాస్, ఆర్‌జీ రీజియన్ బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుకుమార్, మందమర్రి ఏరియా అధ్యక్షుడు ఆర్.విజయప్రసాద్, శాంతిఖని గౌరవ అధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు బి.వెంకటేష్, ఉపాధ్యక్షుడు డి.రమేష్, కోశాధికారి కె.రమేష్, డి.నాగవర్ధన్, శాంతిఖని గని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



చందులాల్

జన్నారం: సాహితీ సేవా రంగంలో సేవలు అందించినందుకుగాను మండలంలోని పొనకల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లావుడ్యా చందులాల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అందజేసే జాతీయ నంది పురస్కారానికి ఎంపికైనట్లు సమాచారం అందింది. ఈ నెల 14న హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

హద్దు గీసినా దాటారు !



సర్కారు భూమిలో వెలిసిన నిర్మాణం



సర్కారు భూమిగా చూపిస్తున్న హద్దురాయి

- జిల్లా కేంద్రంలోని సర్కారు భూమి కబ్జా
- రూ.కోట్ల విలువైన భూమిపై అక్రమార్కుల కన్ను
- ప్రభుత్వ భూమినే ప్లాట్లు చేసి అమ్మినా చర్యల్లేవ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణ నడిబొడ్డున ఉన్న సర్కారు భూమి అన్యాక్రాంతం అవుతోంది. గత కొంతకాలంగా ప్రైవేటు, ప్రభుత్వ భూమి మధ్య హద్దులపై వివాదం ఉంది. ఇటీవల కొందరు సర్కారు భూమిలోనే చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. మంచిర్యాల పట్టణం నడిబొడ్డున ఉన్న కార్మెల్ స్కూల్ వెనకవైపు, రాళ్లవాగుకు సమీపంలో ఉన్న సర్వే నంబరులో 13.09ఎకరాలు ఇనామ్ పట్టా భూమి ఉంది. ఈ భూమిని ఆనుకునే 283 సర్వేనంబరులో 13.35ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 283/1 సర్వేనంబరులో 1.32లావణి పట్టా ఉంది. 2019లోనే 283/3 సర్వేనంబరులో 1.25ఎకరాలను 'నాలా'(వ్యవసాయేతర భూమి)గా చట్టవిరుద్ధంగా మార్చారంటూ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ శాఖ ఫీజులు, విలువ, జరిమానాలు కలిపి రూ.10లక్షల వరకు విధించింది. గతంలో పలుమార్లు ఫిర్యాదులు వెళ్లగా సర్వే అధికారులు హద్దులు గుర్తించారు. అయితే ఆ హద్దురాళ్లను సైతం దాటి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై అప్పట్లోనే అధికారులు ఇళ్ల నిర్మాణాలు కూల్చివేయగా, తాజాగా కొందరు మళ్లీ అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఆ భూమిలో చదును చేసి తాత్కాలికంగా షెడ్లు వేస్తూ తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ భూములు ప్రస్తుతం 'ధరణి' పోర్టల్‌లో సర్వే 282లోని భూమిని నోషనల్ ఖాతా ఇళ్ల స్థలాలుగా ఉంది. ఇక 283 సర్వేనంబరు సంబంధించిన భూమి మాత్రం నిషేధిత జాబితాలో ఉంది. అంతేకాక 283/2 సర్వేనంబరులో మొత్తం 12.03ఎకరాలు ప్రభుత్వ భూమిగానే చూపిస్తోంది.

అధికారులు దృష్టి సారిస్తేనే..

ఇళ్ల స్థలాలు ఉన్న వ్యవసాయ పట్టాభూమి, సర్కారు భూమి పక్కనే ఉండడంతో చాలా వరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన వ్యాపారులు ఈ భూమిని ఎప్పుడో తమ కబ్జాలోకి తెచ్చుకున్నారు. తమ సంస్థ పేరుతోనే ప్లాట్లు చేసి అమ్మేశారు. ప్రైవేటు భూమితో సర్కారు భూమిని రోడ్లు తీశారు. ఇళ్లు నిర్మించి అమ్మేశారు. ఇందులో కొన్ని సర్కారు భూమిలోనే నిర్మాణాలు వెలిశాయి. వీటిపై గతంలోనే దీనిపై ఫిర్యాదులు వెళ్లగా, కొత్తగా వెలిసిన నిర్మాణాలను అప్పటి అధికారులు కూల్చివేశారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లారు. ఇక మిగిలి ఉన్న చోట్ల కూడా మళ్లీ నిర్మాణాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సర్వే అధికారులు సైతం గతంలోనే హద్దులు గుర్తించారు. ఆ సమయంలోనే 3.08ఎకరాలు కబ్జా చేసినట్లు గుర్తించారు. తర్వాత కూడా ఆ హద్దురాళ్లని సైతం పట్టించుకోకుండా కబ్జా చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ భూములపై రెవెన్యూ అధికారులు విచారణ చేసి, ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్లలో రూ.కోట్లలో విలువ చేసే సర్కారు భూమిపై ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటున్నారు.

విచారణ చేపడుతాం
పట్టణంలోని 282, 283 సర్వేనంబర్లలోని భూమిలో ఆక్రమణలపై మా దృష్టికి వచ్చింది. దీనిపై సర్వే అధికారులతో పూర్తి స్థాయిలో సర్వే చేయించి, విచారణ జరుపుతాం.
– కె.రమేశ్, తహసీల్దార్, మంచిర్యాల

ప్రైవేటు ఆస్పత్రులపై సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: ''కాసు'పత్రులు శీర్షికన ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. అర్హత లేని వైద్యులతో రోగులకు చికిత్స అందిస్తూ, సూపర్, మల్టీస్పెషాలిటీ పేరిట ఆస్పత్రులు నెలకొల్పి వైద్యులు లేకున్నా వారి పేర్లతో ఇతరులు వైద్యం అందిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రైవేటు ఆస్పతుల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతీ ప్రైవేటు ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో నమోదు ఉన్న వైద్యులు, అర్హతలు, వైద్యం అందించే వివరాలు బోర్డుపై ఉండాలని తెలిపారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయించుకోవాలని, లేని వారి పేర్లను తొలగించాలని అన్నారు. కన్సల్ట్ వైద్యులు ఏ సమయానికి వస్తారు, ఫీజు వివరాలు ప్రదర్శించాలని, ఆసుపత్రిలో రిజిస్టర్ అయిన వైద్యుడు ఒక ఏడాదిపాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వాలిఫైడ్ పారామెడికల్ స్టాఫ్ ఉండాలని, అంబులెన్సుల ద్వారా వచ్చిన రోగికి సంబంధించిన కేస్ వివరాలను ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రి నుంచి పంపే కేసులను నమోదు చేసి, అంబులెన్సులకు సంబంధించి న వివరాలను నమోదు చేయాలని, ఫీజు వివరాలు రెండు, మూడు స్థలాల్లో ప్రదర్శించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తూకం వేయరు.. తరలించరు..!



హాజీపూర్ మండలం గుడిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం

గన్నీ సంచులు అవసరం	43.50 లక్షలు
అందుబాటు ఉన్నవి	30లక్షలు
ఇప్పటివరకు కేంద్రాలకు సరఫరా చేసిన సంచులు	50 వేలు
కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 12 రోజులు	
ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు : 0	

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూపులు
- మిల్లుల ట్యాగింగ్, తరలింపులో అలసత్వం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభించినా ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోంది. ధాన్యం ఎప్పుడు తూకం వేస్తారోనని రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల ఒకటిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. గన్నీ సంచులు సరఫరా చేయకపోవడంతో తూకం వేయడం లేదు. కేంద్రాలను రైస్‌మిల్లులకు ట్యాగింగ్ చేయలేదు. జిల్లాలో పీఏసీఎస్ 86, ఐకేపీ 132, డీసీఎమ్మెస్ 38, మెప్మా 6 చొప్పున మొత్తంగా 262 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఒక్క క్వింటా ధాన్యం కూడా సేకరించి మిల్లులకు తరలించినట్లు రికార్డుల్లోకి ఎక్కలేదు. గన్నీ సంచులు కేంద్రాలకు ఇవ్వకపోవడం, కొనుగోలు కేంద్రాల కేటాయింపులో స్పష్టత రాకపోవడంతో మిల్లుల కేటాయింపు జరగలేదు. గన్నీ సంచులు అందిన చోట కేంద్రాలు, మిల్లులకు ట్యాగింగ్(కొనుగోలు కేంద్రం నుంచి కేటాయించిన మిల్లుకు) లేక ధాన్యం తరలింపు జరగడం లేదు. దీంతో ఏజెన్సీల నిర్వాహకులు ధాన్యం తూకం వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. తూకం వేసి రోజుల తరబడి కేంద్రంలో నిల్వ చేస్తే మిల్లుకు తరలించిన సమయంలో బరువు తగ్గి నష్టపోవాల్సి వస్తుందని, తరుగు పేరుతో మిల్లర్లు కోత విధించే అవకాశం ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

భారీగా లక్ష్యం.. సేకరణ ఆలస్యం

జిల్లాలో ఈ ఏడాది 1,00,899 ఎకరాల్లో వరి సాగు కాగా, 2.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, విత్తన కంపెనీ, రైతుల అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు 1.74లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. 262 కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించారు. కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబోసుకుని ఎదురు చూస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో నాణ్యత, తేమ 17శాతం కన్న తక్కువగానే ఉంటుందని, కవర్లు అద్దెకు తీసుకొచ్చి కుప్పలపై కప్పుతున్నారు. తూకం ఆలస్యమయ్యే కొద్దీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోటెత్తుతోంది. ఒకేసారి తూకం వల్ల మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌కు లారీలు రోజుల తరబడి ఎదురుచూపులు తప్పేలా లేవు. ఒక్కో మిల్లులో 20 నుంచి 25లారీలు బారులు తీరే అవకాశం ఉంది.

వారం రోజులైతంది..



ధాన్యం కల్లంలో ఆరబోసుకుని వారం రోజులు అవుతుంది. గన్నీ సంచులు రాలేదని కాంటా పెడతలేరు. ఆరబోసుడు కుప్పజేసి కవర్లు కప్పుడు అవుతుంది. మాపటి పూట మబ్బులు వస్తున్నాయి. కవర్లు ఇయ్యలే.. కొనుక్కొని కప్పుకునుడు అయితంది. వెంటనే కాంటాబెట్టి మిల్లుకు పంపుతే మంచిగుండు.
– కారుకూరి వినోద్, గ్రామం: గుడిపేట్, మం: హాజీపూర్

ఎదురుచూపులు తప్పడం లేదు



అమ్ముకునేందుకు ఎదురు చూపులు తప్పడం లేదు. వారం రోజులు అవుతుంది. కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వడ్లు ఎండినై మాయిశ్చర్ కూడా తక్కువగానే వస్తుంది. సెంటర్ ఓపెన్ చేసింన్రు, కాంటా పెడతలేరు. ఎప్పుడు అకాల వర్షం వస్తుందో.. పంట తడిసిపోతుందని ఆందోళన అవుతుంది.
– ఎస్.మలయ్య, గ్రామం: గుడిపేట్, మం: హాజీపూర్

సెంటర్ ఓపెన్‌తోనే సరి..



సెంటర్‌కు తెచ్చి వారం రోజులు అవుతుంది. ఓపెన్ చేసింన్రు కాంటా పెడుతలేరు. గన్నీ సంచులు రాలేదంటున్నారు. ఎప్పుడు కాంటా పెడతరో ఏమో తెలియడం లేదు. రోజు వడ్ల కాడ కాపలా ఉంటున్నాం. ఇంకా ఎన్ని రోజులకు కాంటా పెడతరో.
– గోపాతి వెంకన్న, హాజీపూర్

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



బృహత్ పల్లెప్రకృతి వనంలో నరికివేసిన చెట్లు



అధికారులతో వాదనకు దిగిన వ్యక్తులు

- 10గుంటల్లోని 200కు పైగా చెట్లు నరికివేత
- బాధ్యులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- కర్ణమామిడి బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఘటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలోని కొండపల్లి శివారులో ఉన్న బృహత్ పల్లె ప్రకృతివనంలోని చెట్లపై గొడ్డలి వేటు పడింది. శుక్రవారం ఆ స్థలం తమదంటూ పది గుంటల్లోని 200కు పైగా చెట్లను నరికివేశారు. 2021లో కొండపల్లి శివారు గోదావరి తీరంలోని పది ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు స్థలంగా గుర్తించి రెవెన్యూ అధికారులు పల్లె ప్రకృతి వనానికి కేటాయించగా పెద్దయెత్తున మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. ఉపాధి హామీ పథకంలో పూలు, పండ్లు, ఔషధ మొక్కలు, నీడనిచ్చే మొక్కలు 35వేలకు పైగా నాటారు. రూ.15లక్షలు వెచ్చించి సంరక్షించారు. చెట్లు ఏపుగా పెరిగాయి. కర్ణమామిడి గ్రామానికి చెందిన గడ్డం మల్లారెడ్డి, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి పల్లె ప్రకృతి వనం స్థలం తమదంటూ పచ్చని చెట్లను గొడ్డళ్లతో నరికేశారు. హాజీపూర్ మండల ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, గ్రామ కార్యదర్శి వెంకటస్వామి, కారోబార్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి సంఘటన స్థలానికి చేరుకుని చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. దీంతో మల్లారెడ్డి, అతడి కుమారుడు మధుసూదన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని కొందరు ప్రజాప్రతినిధులు ముంపునకు గురైన తమ భూమిలో కావాలని మొక్కలు నాటించారని ఆరోపిస్తూ.. ప్రస్తుత అధికార పార్టీ నాయకుడి అండతో చెట్లు నరికి వేస్తున్నామని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

దాదాపు పది గుంటల స్థలంలోని వివిధ రకాల 200కు పైగా చెట్ల నరికివేతను డీఆర్‌డీఓ కిషన్, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. వీరి ఆదేశాల మేరకు ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి అక్కల వెంకటస్వామి హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదాయపన్ను మాఫీకి కృషి



ప్రచారం చేస్తున్న వెరబెల్లి రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సింగరేణి కార్మికుల ఆదాయపన్ను మాఫీకి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లోని హిమ్మత్‌నగర్ కొత్త రోడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌లో సింగరేణి కార్మికుల గళం వినిపించాలంటే బీజేపీ గెలువాలని, కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో ఐటీ రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి గెలిచిన తరువాత కాంగ్రెస్ కూడా అదే రీతిలో అన్యాయం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సత్రం రమేష్, నాయకులు పబ్బతినేని కమలాకర్‌రావు, పానుగంటి మధు, కుర్ర చక్రి, ఈర్ల సదానందం, సదయ్య, బద్రి శ్రీకాంత్, రాగిడి రవి, శ్రీనివాస్, కోరేపు మహేందర్ పాల్గొన్నారు.

విజయానికి తోడ్పడే వారికే ప్రాధాన్యం

- 'స్థానిక' ఎన్నికల్లో పోటీకి అవకాశం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యే వినోద్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తోడ్పడే పార్టీ శ్రేణులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ఆర్పీ గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో గడ్డం వంశీకృష్ణ రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించే కార్యకర్తలను గుర్తించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికల్లో పోటీకి అవకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. ఏడాదికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీనిచ్చి మోసం చేశారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో 20కోట్ల మంది నిరుద్యోగులు వంచనకు గురయ్యారని అన్నారు. సింగరేణి బొగ్గును ప్రైవేటు శక్తులకు అప్పగించడానికి కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రాన్ని పదేళ్లపాటు పరిపాలించిన బీఆర్‌ఎస్ రెండూ ఒకటేనని విమర్శించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ నేతకాని కులస్తులకు ఇతర కులాలతో సమానంగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లు వేయడం దండుగని, మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీని ఎన్నికల్లో బొందపెట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బి.వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు, ఆరెపల్లి మోహన్, ఐన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మత్తమారి సూరిబాబు, చిలుముల శంకర్, ముచ్చర్ల మల్లయ్య, కారుకూరి రాంచందర్, మునిమంద రమేష్, దావ రమేష్, రొడ్డ శారద, దుర్గాభవానీ, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, నర్సింగరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేస్తున్న వారికి గౌరవం ఇవ్వరా..?

కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న నాయకులకు సమావేశాల్లో గౌరవం ఇవ్వరా అని బెల్లంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్, సీనియర్ నాయకుడు బండి ప్రభాకర్ నిలదీశారు. సమావేశంలో ఒక్కసారిగా వేదికపైకి వచ్చిన ఆయన మైక్ తీసుకుని మాట్లాడారు. పార్టీ కోసం ఎంతగా కష్టపడినా గుర్తింపు లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి శ్రీధర్‌బాబు సముదాయించడంతో వేదిక దిగి వెళ్లారు. ఈ చర్య సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న గ్రూపు విబేధాలను రట్టు చేసింది.

క్రీడలకు యాజమాన్యం పెద్దపీట



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఎం ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరపు క్రీడల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం మనోహర్ హాజరై మాట్లాడారు. సింగరేణిలోని క్రీడాకారులకు యాజమాన్యం ఇచ్చే ప్రోత్సాహంతో కోలిండియాలో అనేక బహుమతులు గెలుచుకుని సింగరేణి పేరు నిలబెట్టారని అన్నారు. ఏరియాలోని క్రీడాకారులు కోలిండియాలో రాణించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వర రెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ అధికారులు, క్రీడాకారులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: 'అప్రకటిత విద్యుత్ కోతలు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. చెన్నూరు ఏడీఓ రవికుమార్, ఏఈ కుమార్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమావేశం అయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఎలాంటి కోతలు విధించవద్దని స్పష్టం చేశారు. గత మూడు రోజులపాటు గ్రామాల్లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను నరికించడం వల్ల సరఫరా నిలిపి వేసినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 24గంటలపాటు అందుబాటులో ఉంటామని ఏడీఏ తెలిపారు.

పోలీసుల చేతివాటం?

జైపూర్: జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇసుక తరలింపులో ట్రాక్టర్ల యాజమానుల నుంచి డబ్బులు తీసుకుని పరోక్షంగా వారికి సహకరిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను సైతం వదిలిపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్థానికంగా ఇళ్ల అవసరాలకు ఇసుక రవాణాకు వెసులుబాటు కల్పించినప్పటికీ పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడంతో కొరత నెలకొంది. దీంతో ఇందారం గోదావరి నది నుంచి రాత్రి వేలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఇందారం వద్ద ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు వారి నుంచి డబ్బులు తీసుకుని వదిలి పెట్టినట్లుగా సమాచారం.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చారి



చారి

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కొండపాక చారిని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామిస్తూ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చారి మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన



ఎంపికైన అభ్యర్థులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైయంట్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ జాబ్‌మేళాకు స్పందన లభించింది. కంపెనీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ పి.సుశాంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 50 మంది హాజరయ్యారు. అందులో 15 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులను మిమ్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ పి.ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్‌రావు, డైరెక్టర్ ఎం.విజయ్‌కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ కే.శ్వేత, టాస్ కో ఆర్డినేటర్ సిహెచ్.రోహిత్‌కుమార్, టెక్నికల్ కో ఆర్డినేటర్ డి.ప్రవీణ్‌కుమార్, అధ్యాపక బృందం అభినందించారు.

డెడ్‌స్టోరేజీకి 'గొల్లవాగు'

- ఆందోళనలో రైతులు
- మరో నెల రోజులు నీళ్ల డిమాండ్
- అందుబాటులో ఉన్నవి రెండు మీటర్లే..



భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్

భీమారం: మండల కేంద్రం భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుతోంది. ఎండల తీవ్రతతో రోజురోజుకు నీటిమట్టం పడిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 155.500 మీటర్లు కాగా ఇప్పటివరకు 150.000 మీటర్లు మాత్రమే నీరుంది. నీటిమట్టం 148.00 మీటర్లకు పడిపోతే డెడ్‌స్టోరేజీకి చేరినట్లే. రెండు మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో మరో నెల రోజులపాటు పంట పొలాలకు నీరందుతుందా లేదా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు కింద ఆయకట్టు 9,500 ఎకరాలు ఉండగా.. ఈసారి 6 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇందులో భీమారం, చెన్నూర్ మండలాల్లోని గ్రామాలు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ తగ్గిపోవడంతో అధికారులు సైతం మరో నెలరోజులపాటు నీటిని ఎలా అందించాలనే ఆలోచన పడ్డారు.

అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ

రైతులు పండిస్తున్న పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు ముందే గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడం లేదు. దీంతో యాసంగి పంట మే నెల చివరి వరకు కొనసాగుతోంది. రైతుల్లో అవగాహన లోపించి ఇష్టారాజ్యంగా పంటలు వేయడంతో సాగునీటి సమస్య ఏర్పడుతోందని ఇరిగేషన్ శాఖ అధికారులు అంటున్నారు.

సుద్దాలవాగుకు నీళ్లు

గొల్లవాగు ప్రాజెక్ట్ నీటిని చెన్నూరు మండలం సుద్దాలవాగుకు ఫిబ్రవరి చివరి నుంచి మార్చి నెల రోజులపాటు వదిలారు. సుద్దాలవాగులో ఫిల్టర్‌లు నిర్మించుకుని పంటలు సాగు చేసుకుంటున్న కిష్టంపేట, బావురావుపేట, సుద్దాల రైతులు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కలిసి వివరించారు. దీంతో గొల్లవాగు ప్రాజెక్ట్ ఇంజినీర్లు నెల రోజులపాటు వాగుకు నీరు వదిలారు. ఫలితంగా ప్రాజెక్ట్ కింద పంటలకు సాగునీటి సమస్య ఏర్పడింది. ఇప్పటికే కొన్ని పంట పొలాలు పొట్టదశకు చేరడంతో నీరందేదెలా అని ఆందోళన చెందుతున్నారు. ఎండలు తీవ్రతరం కావడంతో పంటకి నీటి తడి అందించిన మరుసటి రోజు ఎండిపోతోందని వాపోతున్నారు.



ప్రధాన కాలువ ద్వారా తరలివెళ్తున్న సాగునీరు

ఇబ్బంది పడుతున్నాం



గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ కింద సాగు చేసుకుంటున్న. పొలానికి నీటి సమస్య వస్తే ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. కాలువ పైనే ఆధారపడి పంట సాగు చేస్తున్నాను. మరో కొన్నిరోజులు ఒక ప్రణాళిక ప్రకారం నీటిని అందించాలి.

– రైతు అంకయ్య, ఒత్కులపల్లి

రెండెకరాలు సాగు చేస్తున్న



కొత్తపల్లి సమీపం గుండా వెళ్తున్న గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ ద్వారా రెండు ఎకరాలు వరిసాగు చేస్తున్నాను. గొల్లవాగు ప్రాజెక్ట్‌లో పూర్తిగా నీళ్ల అయిపోతే పంటకు అందక ఎండిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం గొల్లవాగు ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం పెంచేందుకు పాటు పడాలి.

– రైతు కలగూర లింగయ్య, కొత్తపల్లి

నీరందించే ప్రయత్నం చేస్తాం

గొల్లవాగు ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి దగ్గరకి వచ్చిన నేపథ్యంలో పంటలకు సాగు నీరందించేందుకు ప్రయత్నిస్తాం. వచ్చే సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పంటలకు పద్ధతి ప్రకారం నీరందిస్తాం.

– ప్రవీణ్‌రావు, గొల్లవాగు ప్రాజెక్ట్ డీఈఈ

కౌన్సిలర్ ఇంట్లో కార్మికుని విధులు



కారు తుడుస్తున్న మున్సిపల్ కార్మికుడు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని 23వ వార్డు సంజీవయ్య కాలనీ కౌన్సిలర్ రామగిరి బానేష్ ఇంట్లో పనులకు మున్సిపల్ కార్మికున్ని వినియోగించుకోవడం చర్చనీయాంశంగా మారింది. కార్మికులతో ఇంట్లో పనులతోపాటు కారు తుడిపించడం చేయిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం కారు తుడుస్తున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయమై కౌన్సిలర్ బానేష్‌ను సంప్రదించగా.. కార్మికుడికి పనులు చెప్పలేదని, కారుకు దుమ్ము పట్టడంతో తనకు చెప్పకుండా తుడిచాడని అన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్‌ను సంప్రదించగా.. కార్మికులు మున్సిపాలిటీలో వారికి అప్పగించిన పనులు మాత్రమే చేయాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల ఇళ్లలో పనులు చేయొద్దని అన్నారు.

నగదు స్వాధీనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు వస్తున్న గణపురం మోహన్ వద్ద ఆధారాలు లేని రూ.68,100 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి రఘునాథ్‌కు అప్పగించారు.

104 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న డీటీలు



మంచిర్యాలలో పట్టుబడిన బియ్యంతో పోలీసులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం దేవులగూడలోని ఓ షెడ్డులో అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు నిల్వ చేసిన 104.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలాల్, శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన 104.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 214 సంచుల్లో నింపి మహారాష్ట్రకు తరలించేందుకు దేవులగూడలో సిద్ధంగా ఉంచారని తెలిసిందన్నారు. ఈ మేరకు తనిఖీలు చేపట్టగా మర్రి నూతన్‌కు చెందిన షెడ్డులో రేషన్‌బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని సేఫ్ కస్టడీ నిమిత్తం ఆసిఫాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని క్యారీ రో డ్డులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సిరిగిరి బద్రి, వస్తం శంకర్ వివిధ ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ ఏరియాలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టు టౌన్ ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. మహ్మమద్ ఉబేద్ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ఇంటిపై దాడి చేసి భద్రపరిచిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య



నందకిశోర్ (ఫైల్)

కౌటాల(సిర్పూర్): మండలంలోని తలోడి గ్రామానికి నక్క నందకిశోర్(38) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం సలుగుపల్లిలోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న నందకిశోర్ ఏడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ భారంగా మారిందని, మద్యం మానేయాలని భార్య వరలక్ష్మి పలుమార్లు చెప్పినా అలవాటు మార్చుకోలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా నందకిశోర్ మద్యం తాగి రాగా భార్య మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి మళ్లీ తాగొచ్చి భార్యతో మాట్లాడకుండా పడుకున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో భార్య నిద్రలేచి చూడగా నందకిశోర్ ఇంటి ఆవరణంలో అపస్మారక స్థితిలో కిందపడి ఉన్నాడు. పక్కనే పురుగుల మందు ఉండడంతో కుటుంబ సభ్యులు కౌటాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని శుక్రవారం పరిశీలించి వివరాలు తెలుసుకుని, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సీపీఆర్ఎస్ ట్రస్ట్‌బోర్డులో కీలక నిర్ణయాలు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



వీ.సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ ఉద్యోగుల చికిత్సకు సంబంధించిన సీపీఆర్ఎస్ ట్రస్ట్ బోర్డులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య తెలిపారు. ఈ నెల 11న కొత్తగూడెంలోని కంపెనీ కార్పొరేట్ కార్యాలయంలో బోర్డు సమావేశం జరిగిందని పేర్కొన్నారు. డైరెక్టర్(ఆపరేషన్స్) యన్‌వీకే.శ్రీనివాస్, జీఎం(వెల్ఫేర్) బసవయ్య, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నుంచి తనతోపాటు యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారని తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు.

- రిటైర్డ్ అయిన రోజే ఉద్యోగులకు హెల్త్‌కార్డు (సీపీఆర్ఎంఎస్) అందించడానికి అంగీకారం.
- ప్రతీ మూడు నెలలకోసారి ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించాలి.
- క్యాన్సర్, కిడ్నీ వంటి మొండి జబ్బుల విషయంలో కార్డులో ఉన్న రూ.8 లక్షలు అయిన తర్వాత కూడా చికిత్సకు ఇంకా ఎంత అవసరం ఉంటే అంతా మొత్తం ట్రస్ట్ నుంచి చెల్లించాలి.
- 2018 నుండి ఇప్పటివరకు మొండి జబ్బుల విషయంలో రూ.8లక్షలలు ఖర్చు చేసిన వారి ఖాతాల్లో తిరిగి వేయడానికి నిర్ణయం.
- సుమారు 5 వేల మంది రిటైర్డు ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ జతపర్చలేదు. వారి పేర్లు ఏరియాల వారీగా తెలియజేసి తిరిగి జత చేసేలా చర్యలు.
- రిటైర్ కార్మికులు చాలామంది వారి బీపీ, షుగర్ జబ్బులకు నెలవారీ టాబ్లెట్లు ఏ ఏరియాలో ఉంటే అదే ఏరియా హాస్పిటల్‌లో ఇవ్వడానికి అంగీకారం.
- హైదరాబాద్‌లో చాలామంది రిటైర్ కార్మికులు నివసిస్తున్నారు. అటువంటి వారికి హైదరాబాద్ లోనే టాబ్లెట్లు ఇవ్వాలని కోరగా దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.
- రిటైర్డు ఉద్యోగులకు ఏదైనా జబ్బు వస్తే సింగరేణి హాస్పిటల్‌కు వెళ్లి అడ్మిట్ అయితే 40 శాతం డబ్బులను ఫండ్ నుంచి రికవరీ చేయవద్దని కోరగా కోలిండియాలో ఎలా అమలు అవుతుందో తెలుసుకొని దానికి తగ్గట్లుగా నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం హామీనిచ్చింది.

బస్సుపాస్‌లపై 'ఉచిత' ప్రభావం



మంచిర్యాల బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణంలో 120 మంది వరకు పని చేస్తున్నారు. వీరిలో 90 మందికి పైగా చుట్టుపక్క ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారు. ఇదివరకు నెలవారీ పాస్‌లు తీసుకుని ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం మహాలక్ష్మి జీరో టికెట్‌తో రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా సూపర్‌మార్కెట్, ఆస్పత్రుల్లో పని చేస్తున్న మహిళలంతా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారు. దీంతో ఖాళీ సీట్లతో రాకపోకలు సాగించిన బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. ఏ బస్సులో చూసినా పరిమితికి మించి ప్రయాణం సాగుతోంది. మహలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత రోజుకు 60వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) రెట్టింపైంది. ఇందులో మహిళలే 70శాతం పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉచిత ప్రయాణంతో కొన్ని బస్సుల్లో 130 నుంచి 140 మంది ప్రయాణికులు ఉంటున్నారంటే పరిస్థితి ఏ విధంగా మారిందో అర్థమవుతోంది. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత డిసెంబర్ నుంచి ఫిబ్రవరి 24 వరకు మొత్తం 52,75,882 మంది ప్రయాణం చేయగా రూ.21,82,56,179 ఆదాయం సమకూరింది. ఫ్రీజర్నీ అమల్లోకి వచ్చిన తర్వాత డిసెంబర్‌లో 6,05,399, జనవరిలో 10,23,981, ఫిబ్రవరిలో 10,83756 మంది మహిళ ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు.

తగ్గిన పాస్‌లు

మంచిర్యాల డిపోలో అన్ని రకాల బస్సుపాస్‌లపై ప్రభావం పడింది. స్టూడెంట్ పాస్‌లు, జనరల్ (మంత్లీ పాస్)లు అధికంగానే ఉన్నాయి. బాలికల విషయంలో పదో తరగతి వరకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారు. పాస్ జారీకి ఖర్చుల నిమిత్తం రూ.50 చొప్పున ఆదాయం సమకూరేది. రాయితీ కూడిన స్టూడెంట్ పాస్‌లకు గండి పడింది. కిలోమీటర్లను బట్టీ చార్జీలు చెల్లిస్తే రాయితీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక ఏడాదిపాటు చెల్లుబాటు అయ్యేది. జనరల్ పాస్‌లు కూడా ఉన్నాయి. ఉద్యోగులు, వివిధ సంస్థల్లో పనిచేసే వారు మంత్లీపాస్‌లు ద్వారా ప్రయాణం చేసేవారు. మంచిర్యాలలో వస్త్ర, ఆసుపత్రులు, హోల్‌సెల్ కిరాణం, తదితర దుకాణాల్లో మహిళలే ఎక్కువగా పనిచేస్తుంటారు. వీరందరూ దాదాపు 80 నుంచి 90శాతం మేర బెల్లంపల్లి, చెన్నూర్, తదితర చుట్టుపక్క ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారు. మంచిర్యాల నుంచి బెల్లంపల్లి, కాగజ్‌నగర్, జన్నారం, చెన్నూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించేవారు లేకపోలేదు. ఆయా రూట్లలో బస్సుల్లో ఎక్కువగా మహిళా ఉద్యోగులు ప్రయాణం చేస్తుంటారు. ప్రస్తుతం ఫ్రీజర్నీతో బస్సుపాస్‌లు తగ్గిపోయాయి. గతేడాది ఏప్రిల్ 1నుంచి డిసెంబర్ 5 వరకు 2640 సీజన్ పాస్‌ల ద్వారా రూ.57లక్షల ఆదాయం సమకూరింది. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత డిసెంబర్ నుంచి ఇప్పటివరకు చూస్తే 603 సీజన్ పాస్‌లు మాత్రమే కొనసాగుతున్నాయి. విద్యార్థులు, మహిళా ఉద్యోగులు, పేద మహిళలు ఉచిత ప్రయాణంతో పాస్‌లు తగ్గుముఖం పట్టాయి.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

జన్నారం: రెండు ద్వి చక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు యువకులుగా యపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వి వరాల ప్రకారం.. నిర్మల్ జి ల్లా బీర్నందికి చెందిన యు వకులు ద్విచక్ర వాహనంపై జన్నారం మండలంలోని ఓ శుభకా ర్యానికి వస్తుండగా, ఇందన్‌పల్లి గ్రా మ సమీపంలో జన్నారం నుంచి ఇందన్‌పల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ వాహనాలపై వెళ్తున్న బీర్నందికి చెందిన పెంద్రం తిరుపతి, సుదర్శన్, సంతోష్‌లు, జన్నారానికి చెందిన అనీల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై రాథోడ్ బిక్కులాల్ సంఘటన స్థలానికి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని, ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన కొండేటి సంజీవ్(45) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఏఎస్సై మజీద్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవ్ ఇంట్లో కుటుంబ కలహాల కారణంగా అతడి భార్య గత నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. నెల రోజులైనా భార్య రావడం లేదని సంజీవ్ మనస్తాపం చెంది ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ సంజీవ్ గురువారం రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు సాధించిన విద్యార్థి

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి యం.పవన్‌కుమార్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆజ్మీర నరసింహ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న అత్యుత్తమ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు రెండు దశల్లో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు సాధించాడు. పవన్‌కుమార్‌ను హెచ్ఎం నరసింహ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీలు

బెల్లంపల్లిరూరల్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల ఆర్ఎంపీలు, పీఎంపీలు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. శుక్రవారం బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం మంత్రి పాతబెల్లంపల్లిలోని మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్ ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఆర్ఎంపీల సమస్యలను గాలికొదిలేసిందని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదించి ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి తెలిపారు. అనంతరం పలువురు మంత్రి, ఎమ్మెల్యేలను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, ఆర్ఎంపీలు బత్తుల రవి, రాజేశ్వర్, బ్రహ్మానందం, అజీజ్, రాజేశం, రవీందర్, శ్రీనివాస్, రవీందర్, వెంకటేశం, రాజు, నాయకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆసుపత్రి సిబ్బంది స్పందన



లచ్చన్నకు చికిత్స చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

జన్నారం: రాత్రి 12 గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన వ్యక్తిని విష కీటకం కుట్టింది. భయంతో ఆసుపత్రికి వెళ్లగా అర్ధరాత్రి నుంచి మూడు గంటలపాటు చికిత్స చేసి ప్రభుత్వ వైద్య సిబ్బంది ప్రాణపాయం తప్పించారు. మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పురంశెట్టి లచ్చన్న గురువారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం వెళ్లగా గుర్తు తెలియని విషపురుగు కుట్టింది. రక్తం కారడంతో జన్నారం ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ఎవ్వరు స్పందించక పోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు వైద్యాధికారి ఉమాశ్రీకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఆమె సూచన ప్రకారం ఏఎన్ఎంలు సులోచన, వసంత చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు.

కారు ఢీకొని డ్రైవర్ మృతి



చిన్నయ్య మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన దుర్గం చిన్నయ్య(40) మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన చిన్నయ్య డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన ఎర్గటి వెంకటేశ్‌తో కలిసి పని నిమిత్తం రెబ్బెనకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఇందిరానగర్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి రెబ్బెన వైపు వెళ్తున్న చిన్నయ్యను కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు రెబ్బెన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆశిష్ మల్లేశ్ చెన్నూరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.